క్లుప్తంగా

కరాటేలో ప్రతిభ చాటిన విద్యార్థులు



విద్యార్థులతో కరాటే గ్రాండ్ మాస్టర్ హైదర్ అలీ తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని విశ్వ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో జరిగిన కరాటే బెల్ట్ టెస్ట్ ప్రోగ్రామ్‌లో అమలాపురం పవర్ కిక్ షూటోకాన్ కరాటే డు అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ చాటారు. దాదాపు 100 మంది విద్యార్థులు ఈ బెల్ట్ ఎగ్జామ్‌లో పాల్గొని ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్, బ్లాక్ బెల్ట్ విభాగాల్లో ప్రతిభ కనబరిచారని చీఫ్ కోచ్ పడాల అంజి తెలిపారు. విద్యార్థులకు గ్రాండ్ మాస్టర్ హైదర్ అలీ చేతుల మీదుగా బెల్ట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ చైర్మన్ వాసంశెట్టి సుభాష్, కరాటే ఇన్‌స్ట్రక్టర్ చిక్కం సురేష్, రిఫరీలు దేశంశెట్టి సాయిబాబు, అల్లాడి రవి, ఎం.కమార్‌లు పాల్గొన్నారు.

80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు



రైతులకు సబ్సిడీ విత్తనాలు అందిస్తున్న నాయకులు

అల్లవరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో నారుమళ్లు నష్టపోయిన రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలను సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి సోమవారం అందించారు. బోడసకుర్రులోని రైతు భరోసా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో విత్తనాలను రైతులకు అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి దుర్గా శ్రీను, వీఆర్‌ఓ గెద్దాడ సత్యనారాయణ, వీఏఏ బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

భవానీల కలశ పూజ



గచ్చకాయలపోరలో 108 కలశాలతో భవానీలు

కాట్రేనికోన: మండలంలోని గచ్చకాయలపోరలో కనకదుర్గ అమ్మవారి మాలధారణ చేపట్టిన భవానీలు వెంకన్న గురు భవానీ ఆధ్వర్యంలో 108 కలశాలతో పూజా మహోత్సవం చేపట్టారు. భవానీలు నాగపట్టణం సమీపంలోని పంట కాలువలో స్నానం ఆచరించి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పూజా వేదికపై కలశ పూజ చేశారు. గణపతి పూజ, అమ్మవారికి కుంకుమార్చన, దేవీ సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రిజిస్ట్రేషన్లు చేయడం లేదంటూ ఆగ్రహం

యానాం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన ఉచిత గ్యాస్ కనెక్షన్ల పథకానికి సంబంధించి రిజిస్ట్రేషన్లు చేయడంలో స్థానిక గోపాల్‌నగర్‌లోని గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ వినియోగదారులు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై యానాం బీజేపీ శాఖ అధ్యక్షుడు కనకాలరాజు ఆధ్వర్యంలో వినియోగదారులు ఏజెన్సీ సిబ్బందిని ప్రశ్నించారు. పథకంలో చేరేందుకు రిజిస్ట్రేషన్‌కు వెళుతుంటే సంబంధిత ఏజెన్సీ వారు పట్టించుకోవడం లేదన్నారు. వెబ్‌సైట్ పనిచేయడం లేదని, స్కీమ్‌ను ఆపేశారని పొంతనలేని సమాధానాలు చెబుతున్నారంటూ వారు ఆరోపించారు. గ్యాస్ ఏజెన్సీ నిర్లక్ష్యంపై ఎల్జీ తమిళిసై సౌందరరాజన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సబ్బతి లోకేష్, శ్యామ్ పాల్గొన్నారు.

27న అమృత లింగేశ్వరునికి జలాభిషేకార్చన

మామిడికుదురు: పవిత్ర వైనతేయ గోదావరి నదీ తీరం అప్పనపల్లిలో కొలువుదీరిన ఉమా అమృత లింగేశ్వరునికి ఈ నెల 27వ తేదీ బుధవారం 108 బిందెలతో జలాభిషేకార్చన, పంచామృత అభిషేకార్చన, లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీశివ కేశవ భక్త బృందం సోమవారం తెలిపింది. మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం శివుడు ఉద్భవించిన రోజు పురస్కరించుకుని ఈ పూజ ఏర్పాటు చేశామన్నారు. 2005 నుంచి ఈ ప్రత్యేక పూజలు చేపట్టామని చెప్పారు. ఇంత వరకు పద్దెనిమిదేళ్ల ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. 19వ ఏడాదిలో 108 బిందెలతో జలాభిషేకార్చన ఏర్పాటు చేశామని చెప్పారు.



బోడసకుర్రులో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



అమలాపురంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చక స్వాములు



మురమళ్లలో సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న పండితులు



ఎ.వేమవరంలో సుబ్రహ్మణ్యస్వామి



ముమ్మిడివరం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

కార్తికేయ.. శరణు.. శరణు..

- ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఐ.పోలవరం: మండలంలోని గుత్తినదీవి- వేమవరంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి ఆలయానికి భక్తుల తాకిడి మొదలైంది. స్వామి వారిని టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, పెన్మత్స చిట్టిరాజు, మద్దింశెట్టి రాజుబాబు, కొండమూరి విజయబాబు, మెండా వెంకన్నబాబు, కాటం సత్తిరాజు, మోర్త చిన్నా తదితరులున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ ఎస్.కొండయ్య బందోబస్తు ఏర్పాటుచేశారు. మురమళ్లలో ఉదయం నుంచి భక్తులు గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.

ముమ్మిడివరం: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి తీర్థ మహోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులు స్వామివారికి పూలు, పడగలు చెల్లించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముమ్మిడివరంలో శ్రీవల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, తానేల్లంక, గాడిలంక, కొత్తలంక, అయినాపురం ఆలయాల్లో స్వామి కల్యాణం వైభవపేతంగా నిర్వహించారు.



గుత్తినదీవి-వేమవరంలో స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో షష్ఠి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి 1.22 గంటలకు స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. సోమవారం తెల్లవారుజాము నుంచి స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ దొమ్మేటి ధర్మారావు, ఆలయ ఈఓ పీవీవీ సత్యనారాయణ, ఉత్సవ నిర్వహణ ఈఓ కోనేటి కార్తిక ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా బ్యాంక్ స్ట్రీట్ నుంచి ట్రాఫిక్‌ను మళ్లించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక శ్రీకామాక్షీ పీఠంలో వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్య దివ్య కల్యాణం పీఠాధిపతి కామేశ మహర్షి పర్యవేక్షణలో సోమవరం సాయంత్రం వైభవంగా జరిగింది.

తాళ్లరేవు: స్థానిక భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో అర్చకులు కొండవీటి శివరామకృష్ణ నేతృత్వంలో తెల్లవారుజాము నుంచి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. పిల్లంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో వేద పండితులు వేలూరి వెంకట కామేశ్వర శర్మ నేతృత్వంలో స్వామివారి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. జార్జిపేట, సుబ్బారాయుని దిమ్మ ప్రాంతాల వద్ద వేంచేసియున్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

ఉప్పలగుప్తం: సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని మండలంలోని సన్నవిల్లి, ఉప్పలగుప్తం, కూనవరం, ఎస్.కొత్తపల్లి, ఎస్.యానం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం నుంచి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి కల్యాణం, గ్రామోత్సవం నిర్వహించారు. తీర్థంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్.కొత్తపల్లిలో అగ్నికుల క్షత్రియ యువజన సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న షష్ఠి ఉత్సవంలో సినిమా సెట్టింగులను తలపించేలా విద్యుత్ దీపాలంకరణ చేశారు. అయోధ్యలో నిర్మిస్తున్న శ్రీరామ మందిరం సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అల్లవరం: మండలంలోని బోడసకుర్రులో కొలువైయున్న వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, గుడ్డివానిచింత వద్ద ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, కొమరగిరిపట్నం ఆలయాల్లో షష్ఠి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

యానాం: స్థానిక శివాలయం వద్ద ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామి దర్శనానికి తెల్లవారుజాము నుంచి భక్తులు తరలివచ్చారు.



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అశోక్

ఎస్ఐ శేరు నూకరాజు, ట్రాఫిక్ ఎస్ఐ పువ్వల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. కనకాలపేట గ్రామ పరిధిలోని గణపతినగర్‌లో కొలువైన శ్రీలక్ష్మీగణపతి, శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పంచమ వార్షిక షష్ఠి మహోత్సవంలో సోమవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొని విశేష పూజలు నిర్వహించారు.

అమలాపురం రూరల్: మండలంలోని ఎ.వేమవరంలో వేంచేసి ఉన్న వల్లీ దేవసేన సమేత బాలసుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆలయ ఆవరణలోని 42 అడుగుల బాల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు గూడా హరిశ్చంద్రుడు కుటుంబీకులచే స్వామి వారి కల్యాణం నిర్వహించారు. తాలూకా ఎస్ఐ అందే పరదేశి బందోబస్తు నిర్వహించారు. నడిపూడి గ్రామ శివారు మెట్లరాంజీ కాలనీలోని పుట్ట సుబ్రహ్మణ్యస్వామికి భక్తులు పూజలు చేశారు. రంగాపురంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. జనుపెల్లిలో రుక్మిణీ సమేత మదన గోపాలస్వామి పీఠానికి చెందిన గురుస్వాములు, భవానీలు ఎ.వేమవరంలోని వల్లీ దేవసేన సమేత బాలసుబ్రహ్మణ్యస్వామికి పానకాల కావడిను సమర్పించారు.



ముమ్మిడివరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



కామాక్షీ పీఠంలో సుబ్రహ్మణ్య దివ్య కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు



కేశవపురంలో సుబ్రహ్మణ్య తీర్థం



ఎస్.కొత్తపల్లిలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఇంటింటికీ సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన ఎంపీపీ శేషగిరిరావు



సమనసలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి దోలామణి

అల్లవరం: ఇంటింటికీ సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. మొగళ్లమూరులో సర్పంచ్ రాయుడు విష్ణు త్రిమూర్తులు అధ్యక్షతన ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమం ఇలాగే గడప గడపకూ చేరాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. మొగళ్ళమూరు సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డుని ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డి గంగ, జేఎస్‌కే కన్వీనర్ తిక్కా ప్రసాద్, ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, ఏఎంసీ డైరెక్టర్ ఈతకోట సతీష్, గ్రామకమిటీ అధ్యక్షుడు కాశీ చిరంజీవి, కొనుకు మహేష్, కట్టా సత్యనారాయణ, కొల్లు వెంకటరమణ, చింతా భాస్కరరావు కార్యదర్శులు పాల్గొన్నారు.

సమనసలో వై ఏపీ నీడ్స్ జగన్

అమలాపురం రూరల్: మండలంలోని సమనసలో సచివాలయంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజారంజక పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కరెళ్ల రమేష్‌బాబు, ఎంపీటీసీ ఉడుము రామకృష్ణ, గ్రామ కమిటీ మామిళ్ళపల్ల ఫణికుమార్, ఈవోపీఆర్డీ గుబ్బల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఘనంగా రక్షా హరికృష్ణ వర్ధంతి

యానాం: మాజీ ఎమ్మెల్యే, మత్స్యకార నేత రక్షా హరికృష్ణ వర్ధంతిని సమాచారశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ రివర్ బీచ్ వద్ద ఉన్న హరికృష్ణ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి, మత్స్యకార గ్రామాల్లో విద్యా చైతన్యానికి, సామాజిక మార్పునకు, సంస్కరణలకు బాటలు వేసిన రక్షాహరికృష్ణ చిరస్మరణీయులని పేర్కొన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి నాయక్, పీఆర్‌ఏ కొల్లు ప్రసాద్, చెక్కల అరుణ్, రక్షా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



రక్షాహరికృష్ణ విగ్రహం వద్ద నివాళులర్పించిన నాయకులు, అధికారులు

కళాశాల నూతన భవనాన్ని పునర్నిర్మించాలి

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరుకుని 15 ఏళ్లు దాటినా ఇప్పటి వరకూ కళాశాల అభివృద్ధికి నోచుకోలేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ రవికుమార్ విమర్శించారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ స్థానిక కళాశాలను నాడు-నేడు పథకం కింద అభివృద్ధి చేస్తామని ప్రకటించినా ఆ హామీ ఇప్పటి వరకూ నెరవేరకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. జూనియర్ కళాశాల సరిహద్దులను సర్వే చేయించి ఆక్రమణలను తొలగించాలని, ప్రహరీ నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న స్వీపర్, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కోకన్వీనర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ హిమాన్షుశుక్లాకు వినతి పత్రం

అమలాపురం రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ హిమాన్షుశుక్లాకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరంధామయ్య ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి అనంతరం కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు.

ఆర్డీవోకు వినతి

అమలాపురం రూరల్: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ హెల్పర్లు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో ప్రసంగిస్తున్న రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ దివాకర్

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటరులో టౌన్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వాసా శామ్యూల్ దివాకర్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీఎఫ్ అధ్యక్షుడు ప్రభుకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు కాకినాడ నుంచి వచ్చిన బ్రదర్ రఘు క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. ఏసు చెప్పిన సన్మార్గంలో అందరూ నడుచుకుంటే రక్షణ కలుగుతుందన్నారు. అనంతరం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టౌన్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నక్కా రాజకిషోర్, కార్యదర్శి గొల్ల ప్రసన్నకుమార్, ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ నాతి రాజీవ్, పృథ్వీ, స్టెపనస్, ఎం.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

శనైశ్చరుని హుండీ ఆదాయం రూ.5.51 లక్షలు

కొత్తపేట: మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి ఆలయం హుండీ ద్వారా రూ.5,51,696 ఆదాయం వచ్చినట్టు దేవదాయ శాఖ ఏసీ, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. 130 రోజుల అనంతరం సోమవారం వివిధ దేవస్థానాల ఈవోలు ఎం.రాధాకృష్ణ, ఎన్‌వీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు పర్యవేక్షణలో హుండీలను తెరిచి ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల వలంటీర్లు లెక్కించారు. శనైశ్చర స్వామి దేవస్థానానికి సంబంధించి హుండీల ద్వారా రూ.5,51,696, అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.16,500, ఈ ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి ఆలయం హుండీ ద్వారా రూ.25,514 ఆదాయం వచ్చినట్టు ఏసీ అండ్ ఈఓ తెలిపారు. కార్యక్రమంలో మందపల్లి వీడీసీ కన్వీనర్ సాధు చెంచయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు అడపా వెంకటేశ్వరరావు, దేవస్థానం ఎస్ఏ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పరిధి పెంపుతో మరింత ధీమా

అమలాపురం టౌన్: ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకంలో కొత్త రోగాలను చేర్చి సేవలు విస్తృతం చేయడంతో పాటు రూ.25 లక్షల వరకూ పరిమితిని పెంచడంతో ప్రజలకు మరింత ధీమా లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆరోగ్య కొత్త కార్డులను ప్రారంభించిన దృశ్యాలను స్థానిక 12, 15 వార్డు సచివాలయాల్లో కౌన్సిలర్లు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు లైవ్‌లో తిలకించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి, కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, దొంగ నాగ సుధారాణి, వార్డు సచివాలయ అడ్మిన్ ఏఎస్ఆర్ ప్రసాద్, వార్డు కార్యదర్శి కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ-2 కార్యక్రమం

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రారంభించిన ఆరోగ్య శ్రీ-2 కార్యక్రమాన్ని అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు తదితరులు లైవ్‌లో వీక్షించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆరోగ్యశ్రీ-2పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ వీరవెంకట సత్యనారాయణ, ఏఈ సుబ్బారావు, స్వామి, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ ఎన్‌వీవీ సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్ పాల్గొన్నారు.

తెలుగు మహాసభలను విజయవంతం చేయాలి

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరంలో జనవరి 5, 6, 7 తేదీల్లో జరగనున్న అంతర్జాతీయ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలని కోనసీమ జేఏసీ కార్యవర్గం పిలుపునిచ్చింది. స్థానిక ప్రకాశం వీధిలో జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్ అధ్యక్షతన సోమవారం సాయంత్రం కోనసీమ జేఏసీ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలుగు మహాసభల ఆహ్వాన పత్రాలను జేఏసీ ప్రతినిధులు విడుదల చేశారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది కొచ్చర్లకోట సుందర్, కోనసీమ జేఏసీ కన్వీనర్ బండారు రామమోహనరావు, కోకన్వీనర్ వేణుగోపాల్, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, కరాటం ప్రవీణ్, ఉండ్రు బాబ్జి, మడికి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



తెలుగు మహాసభల ఆహ్వానపత్రాలను విడుదల చేస్తున్న కోనసీమ జేఏసీ ప్రతినిధులు

విద్యార్థి విభాగం కమిటీ జాయింట్ సెక్రటరీగా ఆశిష్

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం కమిటీ జాయింట్ సెక్రటరీగా అమలాపురానికి చెందిన కాశి ఆశిష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి ఆశిష్‌కు ఉత్తర్వులు అందాయి. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను ఆశిష్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆశిష్‌ను మంత్రి విశ్వరూప్ పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఆశిష్‌ను డాక్టర్ శ్రీకాంత్, మంగళంపల్లి ప్రదీప్, వర్మ అభినందించారు.



ఆశిష్‌ను పుష్పగుచ్ఛంతో సత్కరిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

స్పోర్ట్స్‌లో మలికిపురం రోటరీ క్లబ్ ప్రతిభ

మలికిపురం: రోటరీ డిస్ట్రిక్ట్ 3020 జోన్ ఫోర్త్ రీజినల్ స్పోర్ట్స్ మీట్ తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించి 21 రోటరీ క్లబ్‌లకు జరిగిన ఆటల పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందించారు. నరసాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్పోర్ట్స్ మీట్ టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్‌లకు పోటీలు నిర్వహించారు. షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో మలికిపురం రోటరీ క్లబ్‌కు చెందిన నల్లి శివకుమార్ గెలుపొందగా, రన్నరప్‌గా మట్ట రవికుమార్ సరిపెట్టుకున్నారు. నర్సాపురంలో జరిగిన పోటీలలో విజేతలైన వారికి నర్సాపురం రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ తోట శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ సెక్రటరీ చందక రాము, రోటరీ ప్రెసిడెంట్ సత్యవతి, సభ్యులు బహుమతులు అందించారు.



ప్రథమ బహుమతి అందుకుంటున్న రొటేరియన్ శివకుమార్

ఈవీఎంలపై అవగాహన పెంచుకోవాలి

ఆలమూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఓటర్లందరూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లపై అవగాహన పెంచుకుని ప్రజాస్వామ్యయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని చెముడులంక, మడికి గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద తహసీల్దార్ ఐపీ శెట్టి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాసు, యు.లక్ష్మీ మౌనిక అధ్యక్షతన నిర్వహించిన ఈవీఎం అవగాహన సదస్సును సోమవారం ఆయన ప్రారంభించారు. ఓటర్ స్లిప్ జారీ దగ్గర నుంచి ఈవీఎంలో ఓటు వేసే వరకూ తీసుకోవలసిన జాగ్రత్తలను ఈసందర్భంగా రెవెన్యూ, బూత్ కమిటీ అధికారులు సమగ్రంగా వివరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. జాబితాలో ఓటు హక్కు లేకపోయినా, తప్పులు దొర్లినా సత్వరమే సమీప అధికారులకు తెలియజేయాలన్నారు. ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.జానకి రామయ్య, పంచాయతీ కార్యదర్శులు కె.మోక్షాంజలి, యు.రేణుక, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

అమలాపురం టౌన్: భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అమలాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పురవీధుల్లో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇదే సమయంలో స్థానిక కోర్టు భవనాల సముదాయం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాపీ లక్ష్మణరావు, కార్యదర్శి బడుగు భాస్కర్ జోగేష్, సీనియర్ న్యాయవాదులు ఎండీ ఆజామ్, వి.భాస్కరశాస్త్రి, జీఎస్ నాయుడు, పినిపే రాధాకృష్ణ పాల్గొన్నారు.